ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటాం

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, జనవరి 28: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎల్‌జీ గార్డెన్స్‌లో జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులతో తనకు చాలా అనుబంధం ఉందని, వారి సాధక, బాధకాలు తెలుసన్నారు. గత సర్కార్ ఆర్టీసీ డిపో దగ్గర రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, ఇంకా పనులు మిగిలి ఉన్నాయన్నారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు మంత్రి ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరుతో ప్రభుత్వ దవాఖాన సూపర్ స్పెషాలిటీ దవాఖానగా ఏర్పాటైందన్నారు. బీద, మధ్య తరగతి ప్రజలకు, విశ్రాంత ఉద్యోగులకు దవాఖాన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్ కల్పించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. రేషన్ కార్డు జారీ చేసేలా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేసేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఇంకా విద్య, వైద్య సేవలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భరోసానిచ్చారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు వొరుగంటి రమణరావు, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

గోవిందుపల్లిలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మెరుగైన పాలన కోసమే జీపీ భవనాల నిర్మాణం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి/ధర్మపురి రూరల్, జనవరి 28: పరిపాలన సౌలభ్యం, మెరుగైన పాలన కోసమే జీపీ భవనాల నిర్మాణం చేపట్టి ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ధర్మపురి మండలం గోవిందుపల్లిలో నిర్మించిన జీపీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు. అర్హులైన పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ చిట్టిబాబు, జడ్పీటీసీ అరుణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దినేశ్, సర్పంచ్ రాజయ్య ఉన్నారు.

ప్రమాణస్వీకారం

మారుతీనగర్, జనవరి 28: మెట్‌పల్లి ఆర్య వైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని వై కన్వెషన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణ ఆర్య వైశ్య అధ్యక్షుడు మైలారపు రాంబాబుతో పాటు నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఆర్యవైశ్య కుల గురువు హర్దిపూర్ పీఠాధిపతి వామన ఆశ్రమ స్వామిజీ ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వదించారు. కార్యవర్గ సభ్యులను ప్రజాప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, వివిధ శాఖల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మెట్‌పల్లి రూరల్, జనవరి 28: గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని యూఏఈ ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు, కళాకారుడు రాజాగౌడ్ పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను తెలుసుకొనేందుకు కాంగ్రెస్ నాయకులు దుబాయ్‌లో పర్యటించారు. ఈ నేపథ్యంలో రెండో రోజు కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రవాస భారతీయులను కలుసుకున్నారు. బృందం సభ్యులు సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను అడిగి తెలుసుకున్నట్లు రాజాగౌడ్ తెలిపారు. దుబాయ్ పర్యటన బృందంలో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ వినోద్ కుమార్, సైదయ్య బాబు, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, గల్ఫ్ కార్మికులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

తెలుగులో ఉచిత ఖుర్ఆన్ కొరకు
ఫోన్ చేయండి
1800 572 3000
సమస్యలన్నిటికీ పరిష్కారం దైవసందేశం ద్వారానే సాధ్యం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

అంబారిపేటలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, జనవరి 28: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని పట్టబద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నర్సింగాపూర్, అంబారిపెట, తారకరామానగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. ఏ సమస్య ఉన్న నేరుగా తన ఫోన్ నంబర్‌కు కాల్ చేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో మూత్రశాలల నిర్మాణం చేయిస్తామని, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నర్సింగ్‌పూర్‌లో మురుగు కాలువను పరిశీలించారు. ఎస్సీ కాలనీ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానా అన్నారు. ఇంటింటికీ తాగు నీరు, ప్రతి వీధిలో మురుగు కాలువను నిర్మిస్తామని, సీసీ రోడ్డు వేసి అభివృద్ధి చేస్తామన్నారు. ఆయన వెంట రాజేందర్, వేణు రావు, సురేందర్, నరేశ్, తిరుపతి రావు, భూమారెడ్డి, వంశీ, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 28: యువత మత్తు పదార్థాలకు బానిసై, జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సూచించారు. జగిత్యాల పట్టణానికి చెందిన ప్రదీప్ దర్శకత్వం వహించిన 'మత్తు' షార్ట్ ఫిలిం పోస్టర్‌ను ఎమ్మెల్యే క్వార్టర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గంజాయి సేవించడంతో పాటు సరఫరా చేస్తూ పలువురు యువకులు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. యువత సన్మార్గంలో నడిచి ఆదర్శంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించి చెడు అలవాట్లకు లోనుకాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ముజాహద్, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, బీఆర్ఎస్ నాయకులు దూమాల రాజ్‌కుమార్, ఆడెపు సత్యం, పెండెం గంగాధర్, నటులు చైతన్య, ప్రభాస్, క్రాంతి, అసిఫ్ పాల్గొన్నారు.

కల్వర్టును నిర్మించాలి

కోరుట్ల రూరల్, జనవరి 28 : అయిలాపూర్ గ్రామం నుంచి తిమ్మాయిపల్లికి వెళ్లే రోడ్డు గత వర్షాకాలంలో వరదనీటికి కొట్టుకుపోయింది. దీంతో తిమ్మాయిపల్లి గ్రామానికి, వ్యవసాయ క్షేత్రానికి వెళ్లేందుకు వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

కోరుట్ల రూరల్, జనవరి 28: చిన్న మెట్‌పల్లి గ్రామశివారులోని ఎల్లమ్మ చెరువు తూము నుంచి వెళ్లే పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. గ్రామశివారులోని ఎల్లమ్మ చెరువు మత్తడి నుంచి వెళ్లే పైప్‌లైన్ వర్షాకాలంలో దెబ్బతిన్నది. కాగా ఆదివారం ఆయన పైప్‌లైన్‌ను పరిశీలించారు. నీటిపారుదల శాఖ అధికారులకు ఫోన్ చేసి మరమ్మతు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొంతం రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆర్మూర్ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

మండలాధరన పూజ

కొడిమ్యాల, జనవరి 28: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర ఆలయ ప్రాణ ప్రతిష్ఠను పూర్తి చేసుకొని 41 రోజులైన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలాధరణ, పంచామృతాభిషేకం, సుదర్శన హోమం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు నాగరాజు రమేశ్ అధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో జగన్నాథ విష్ణువర్ధనచార్యులు, బృంద సభ్యులు పాల్గొన్నారు.

కొండగట్టులో ద్రోణాచార్య అవార్డు గ్రహిత పూజలు

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఇండియన్ అథ్లెటిక్స్ కోచ్ దంపతులు

మల్యాల, జనవరి 28: ద్రోణాచార్య అవార్డు గ్రహిత, ఇండియన్ అథ్లెటిక్స్ కోచ్ నాగపూరి రమేశ్ సతీసమేతంగా ఆదివారం కొండగట్టు ఆంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం రమేశ్ దంపతులను అర్చకులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట జీఎస్ అకాడమీ కోచ్ గౌతమ్‌రెడ్డి, మనీ అకాడమీ కోచ్ మహిపాల్ తదితరులు ఉన్నారు.

గంగపుత్రులు ఐక్యతను చాటుకోవాలి

మారుతీనగర్, జనవరి 28: గంగపుత్రులు ఐక్యతను చాటుకోవాలని గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం మెట్‌పల్లి పట్టణంలో కోరుట్ల నియోజకవర్గ గంగపుత్రులు త్రీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కావూరి వెంకటేశ్ మాట్లాడారు. గంగపుత్రులు ఐక్యతతో హక్కుల సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అలాగే నియోజకవర్గంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంతో పాటు గంగపుత్రులకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటుకు చేసేందుకు పోరాడాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కొమిరెడ్డి కరం పాల్గొని గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ గంగపుత్ర సంఘం డైరెక్టర్లు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు

మెట్‌పల్లి రూరల్: రామలచ్చక్కపేటలో బోనాల ఊరేగింపు

మెట్‌పల్లి రూరల్, జనవరి 28: రామలచ్చక్కపేటలో ఆదివారం మల్లికార్జున స్వామి బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఉదయం మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చన, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం బోనాలు ఊరేగించారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. ఆలయానికి చేరుకుని పూజలు చేశారు

ఉత్సవాలతో ప్రజల్లో చైతన్యం

మల్లికార్జునస్వామి జాతరలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


తాండ్రాలలో మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జనవరి 28: గ్రామాల్లో జరిగే జాతర, ఉత్సవాలతో ప్రజల్లో మరింత చైతన్యం వస్తుందని, మన సంస్కృతి సాంప్రదాయాలు భావి తరాలకు తెలుస్తాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం తాండ్రాలలో మల్లికార్జునస్వామి జాతరకు ఆయన హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. నిర్వాహకులు, నాయకులు ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. సర్పంచ్ గంగాప్రసాద్, కాం గ్రెస్ మండలాధ్యక్షుడు నాగరాజు, నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ సలీం

మారుతీనగర్, జనవరి 28: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ డైరెక్టర్, మాజీ మెజిస్ట్రేట్ మహమ్మద్ సలీం పేర్కొన్నారు. ఆదివారం మెట్‌పల్లి పట్టణ శివారులో గల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2005 సమాచార హక్కు చట్టం వ్యవస్థల్లో పారదర్శకతను, బాధ్యతను పెంచడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చట్టాలపై పలువురు విద్యార్థులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సాబీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారోబార్లను సహాయ కార్యదర్శులుగా గుర్తించాలి

ధర్మపురి, జనవరి 28: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లను మల్టీపర్పస్ విధానం నుంచి మినహాయించి సహాయ కార్యదర్శులుగా నియమించాలని కారోబార్లు పేర్కొన్నారు. ఆదివారం ధర్మపురిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు యూనియన్ ఆధ్వర్యంలో కారోబార్లు వినతిపత్రం అందజేశారు. జీవో 51 ద్వారా గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న వారందరూ మల్టీపర్పస్ వర్కర్లుగా పని చేయాలనడం సరికాదన్నారు. కారోబార్లను పారిశుధ్య పను లు చేయాలని ఒత్తిడి చేస్తుండడంతో మానసిక క్షోభకు గురువుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ యూనియన్ అధ్యక్షుడు సంతోశ్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ఆలయంలో క్యూలైన్లో భక్తులు

ధర్మపురి, జనవరి 28: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి వారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువైంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు గోల్డ్ మెడల్

మెడల్, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కొడిమ్యాల, జనవరి 28: చెప్యాలకు చెందిన 12 మంది విద్యార్థులు కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ బరిగ లక్ష్మీరాజం తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో గ్రామానికి చెందిన గంగాధర శ్రీను, మల్లికార్జున్, ఇర్ఫాన్, సిద్దార్థ్, గౌతం, హర్షవర్దన్, అశోక్, అఖిల్, నిహల్, పూజిత్, రంజిత్, హర్షిత్ గోల్డ్ మెడల్ సాధించారు.

కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలి

జగిత్యాల, జనవరి 28: మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సంఘం నాయకులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిధుల నుంచి భవన నిర్మాణానికి రూ. 20 లక్షల మంజూరు కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. తనవంతుగా రూ.లక్ష సాయం చేస్తానన్నారు. ఇక్కడ సంఘం అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు గోపు రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు దీటి అంజయ్య పటేల్, సిరిపురం రాజేశం, కోశాధికారి రాజన్న, సంఘం సభ్యులు ఉన్నారు.

బావిలోపడి మాజీ సర్పంచ్ మృతి

సారంగాపూర్, జనవరి 28: బీర్‌పూర్ మండలంలోని తాళ్లధర్మారం గ్రామ మాజీ సర్పంచ్ ఏనుగు ఎల్లారెడ్డి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఉదయం పొలం వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, విషయం తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, నాయకులు జైపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి ఉన్నారు.

నేడు కొండగట్టులో టెండర్

మల్యాల, జనవరి 28: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధానంలో భక్తులకు అవసరమగు పలు వస్తువులను అమ్ముకునేందుకు గానూ సోమవారం అంజన్న ఆలయ కార్యాలయంలో టెండర్ కమ్ షీల్డ్, ఈ-టెండర్ నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి వెంకటేశం తెలిపారు. ఆలయ పరిధిలోని 13 రకాల దుకాణాలను నిర్వహించుకునేందుకు టెండర్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దుబ్బ రాజన్న ఆలయంలో

సారంగాపూర్, జనవరి 28: పెంబట్ల శ్రీదుబ్బ రాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అనూష ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు ఆలయ ఆవరణలో కొబ్బరి కాయలు, బెల్లం, పూజ సామగ్రి, పూలు, పూల దండలు, పండ్లు, ఆటబొమ్మలు, గాజులు అమ్ముకునే హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాట దక్కించుకున్న వారికి సంవత్సరం పాటు దుకాణాలు నిర్వహించుకునే హక్కు ఉంటుందన్నారు.

మద్యం మత్తులో ఇంటికి నిప్పు

మల్యాల, జనవరి 28: రాంపూర్‌కు చెందిన పారకొండ రమేశ్ మద్యం మత్తులో తాను నివసిస్తున్న ఇంట్లోని వస్తువులకు నిప్పు పెట్టాడు. పెద్ద ఎత్తున మంటల ఎగిసిపడడంతో గమనించిన స్థానికులు '100'కు సమాచారం ఇవ్వడంతో మల్యాల పోలీసుల ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా అంతకుముందే మంటలను స్థానికులు ఆర్పివేశారు. పారకొండ రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం.

రూ. 25లక్షలు మంజూరు

జగిత్యాల రూరల్, జనవరి 28: అంతర్గాం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి చేపట్టేందుకు మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి రూ.25లక్షలు నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ యాస్మిన్ బాషా ప్రొసీడింగ్స్ జారీ చేశారు. అంతర్గాం పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరిందని నూతన భవనాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఈ నెల 25న లేఖ రాశారు. స్పందించిన మంత్రి నిధుల మంజూరుకు అనుమతి ఇచ్చారు.

నూతన కార్యవర్గం

మల్లాపూర్, జనవరి 28: ముత్యంపేట గ్రామ బీజేపీ అధ్యక్షుడిగా మర్రిపల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా మారుతి, రత్నాకర్, ప్రధానకార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా ప్రవీణ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

యువసేన సంఘం ఏర్పాటు

జగిత్యాల రూరల్, జనవరి 28: గాంధీనగర్ 11వ వార్డు మాదిగ యువసేన సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బొల్లారపు మహేశ్, ప్రధాన కార్యదర్శిగా రౌట్ల రాజేశ్, కోశాధికారిగా దూడ రమేశ్, ఉపాధ్యక్షుడిగా జుట్టు గంగారాం, సలహాదారుగా బొల్లారపు దివాకర్‌ను ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మెట్‌పల్లిలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాల 2018-2011 సంవత్సరం బీకాం విద్యార్థులు ఓ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కరస్పాండెంట్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపక బృందాన్ని పూర్వ విద్యార్థులు సన్మానించారు.

– మారుతీనగర్, జనవరి 28

34 ఏండ్ల తర్వాత ఆత్మీయ కలయిక

అరుదైన, అపురూప ఆత్మీయ సమ్మేళనాన్ని 1989 పూర్వ విద్యార్థులు కొండగట్టు దైవ క్షేత్రం కింద జరుపుకొన్నారు. 34 ఏండ్ల అనంతరం 60 మంది విద్యార్థులు ఒక చోట కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు. పరమపదించిన గురువులను, తోటి విద్యార్థులను స్మరించుకొని నివాళులర్పించారు.

– మల్యాల, జనవరి 28